31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

ఆదివారం 31 మే 2026 పేజీలు : 8

నీతి, నిజాయితీగా, పారదర్శకంగా

## విధులు నిర్వర్తించాలి

రాష్ట్ర డిజిపి సివి ఆనంద్




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 30 :** పోలీసు అధికారులు, సిబ్బంది నీతి, నిజాయితీగా, పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని రాష్ట్ర డిజిపి సి.వి. ఆనంద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి.వి. ఆనంద్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర డిజిపిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం నిర్వహించిన ఈ తొలి సమీక్షా సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజలకు మెరుగైన పోలీసింగ్

-2లో

## చట్టాలపై యువత అవగాహన కలిగి ఉండాలి






- **సోషల్ మీడియాను విద్యాభివృద్ధి కొరకు మాత్రమే ఉపయోగించాలి.**
- **యువత...విద్యార్థినులు ప్రశ్నించే సామర్థ్యం పెంపొందించుకోవాలి.**
- **స్నేహ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 30 :** చట్టాలపై యువత అవగాహన కలిగి ఉండాలని, సోషల్ మీడియాను విద్యాభివృద్ధి కొరకు మాత్రమే ఉపయోగించాలని, యువత, విద్యార్థినులు ప్రశ్నించే సామర్థ్యం పెంపొందించుకోవాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శనివారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో స్నేహ కార్యక్రమం నిర్వహించగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ యువత, బాలికలు తమ హక్కులు, చట్టాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమాజంలో మహిళల భద్రత, గౌరవం, సమాన అవకాశాల కోసం ప్రభుత్వం అనేక చట్టాలు, పథకాలను అమలు చేస్తోందని, వాటి గురించి తెలుసుకోవడం ప్రతి బాలిక బాధ్యత అని అన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో యువత, బాలికలు విద్యాభివృద్ధి, నైపుణ్యాల పెంపుదల, వ్యక్తిత్వ వికాసానికి మాత్రమే సోషల్ మీడియాను ఉపయోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. సోషల్ మీడియా ద్వారా వచ్చే అసత్య ప్రచారాలు, తప్పుడు సమాచారానికి దూరంగా ఉండాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సానుకూల దృక్పథంతో వినియోగించాలని తెలిపారు. విద్యార్థినులు నిర్భయంగా ప్రశ్నించే అలవాటు పెంపొందించుకోవాలని, ప్రశ్నించడం ద్వారా జ్ఞానం పెరుగుతుందని అన్నారు. ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, లింగ వివక్ష, సైబర్ నేరాలు, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండడం అవసరమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు బాలికల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రభుత్వం 33 శాతం రిజర్వేషన్ మహిళలకు కలిపిస్తున్న నేపథ్యంలో యువ బాలికలు కేంద్ర స్థాయి రాజకీయాల

-2లో

## ఉన్నత చదువులు అభ్యసించాలి



- **-అనుకున్న ఉద్యోగాలు, రంగాల్లో స్థిరపడాలి**
- **-సోషల్ మీడియాను పరిమిత స్థాయిలో వినియోగించాలి**
- **-కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరైన ఎస్పీ మహేష్ బిగితే**

**చురకలు ప్రతినిధి సిరిసిల్ల, మే 30 :** ప్రతి విద్యార్థిని ఉన్నత చదువులు అభ్యసించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలి లో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాల కింద స్నేహ (సేఫ్టీ, న్యూట్రిషన్, ఎంపవర్ మెంట్ అండ్ హెల్త్ ఫర్ అడోలేస్సెంట్) సంఘాల సభ్యుల ద్వారా మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం నిర్వహించగా, ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు. ముందుగా జయ జయహే తెలంగాణ పాటను వినిపించారు. ఈ సందర్భంగా స్నేహ సంఘాల విద్యార్థులు అధికార పార్టీ. ప్రతిపక్ష పార్టీగా ఏర్పడి స్పీకర్ సమక్షంలో పలు అంశాలపై చర్చించారు. బాల్య

-2లో

ఏఎస్ఐ రవూఫ్‌కు

## ఆత్మీయ వీడ్కోలు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 30:** పోలీస్ శాఖలో సుమారు 37 సంవత్సరాల పాటు విశిష్ట సేవలు అందించి, ప్రస్తుతం జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న ఏఎస్సై మహమ్మద్ రహూఫ్ ను శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పూలమాల వేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం అనేది కేవలం విధి నిర్వహణ మాత్రమే కాకుండా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే బాధ్యత అని, ఆ బాధ్యతను మహమ్మద్ రహూఫ్ విజయవంతంగా

-2లో

## 2027 గోదావరి పుష్కరాలు విజయవంతంగా నిర్వహించాలి

- **-పుష్కరాలకు ఏర్పాట్లకు కావాల్సిన ప్రతిపాదనలు బుధవారంలోగా పంపాలి**
- **-దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 30:** 2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలు విజయవంతంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జరగేలా సమగ్ర చర్యలు చేపట్టాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఆదేశించారు. శనివారం గోదావరి పరివాహక జిల్లాల కలెక్టర్లతో గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన పనులపై హైదరాబాద్ నుండి దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి గోదావరి పరివాహక జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ పుష్కరాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు చేసేందుకు తరలి వచ్చే అవకాశం ఉన్నందున, ముందస్తు ప్రణాళికలతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. ముఖ్యంగా ఘాట్‌ల అభివృద్ధి, రహదారి సదుపాయాలు, పార్కింగ్ ఏర్పాట్లు, తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు, భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్నాన ఘాట్‌ల వద్ద తగిన ఏర్పాట్లకు కావాల్సిన ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు తమ పరిధిలోని ఏర్పాట్ల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని పుష్కరాలను విజయవంతం చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ పేర్కొన్నారు. ప్రతిపాదనలు మేరకు ప్రాధాన్యత పనులకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు నిర్వహణకు ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పంచాయతి రాజ్, దేవాదాయ తదితర శాఖల ద్వారా చేపట్టనున్న పనులను వివరించారు. ఘాట్లు, మౌలిక సదుపాయాలు, రోడ్ల అభివృద్ధి, నూతన రోడ్ల నిర్మాణం వంటి చేపట్టనున్న పనులకు ఆయా శాఖల ద్వారా ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా అదనపు రోడ్లు మరియు ఇతర అంశాలపై ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజా గౌడ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంజన్నను దర్శించుకున్న కరీంనగర్ డీఆర్వో



**చురకలు ప్రతినిధి,జగిత్యాల, మే 30 :** జగిత్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని కరీంనగర్ జిల్లా రెవెన్యూ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జె. స్వామి శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థాన అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. దర్శనానంతరం ఆలయ స్థానాచారి కపిందర్ వేదోక్త మంత్రిచ్ఛారణలతో ఆశీర్వచనం చేసి శేషవస్త్రం కప్పి, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ సూపరిండెంటఉపాధ్యాయుల చంద్ర శేఖర్ టెంపుల్, ఇన్స్పెక్టర్ తూము శ్రీనివాస్, అర్చకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

## హుజురాబాద్ ప్రాంతీయ ఆసుపత్రిలో శిశువు మృతి

**-విచారణకు ఆదేశించిన సూపరింటెండెంట్**

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ మే 30 :** హుజురాబాద్ పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రిలో ఓ నవజాత శిశువు మృతి చెందడం విషాదానికి కారణమైంది. సైదాపూర్ మండలం రాయికల్ గ్రామానికి చెందిన రమ్య అనే గర్భిణి ప్రసూతి కోసం ఆసుపత్రిలో చేరింది. శుక్రవారం రాత్రి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి శిశువు ఇద్దరు క్షేమంగా ఉన్నట్లు వైద్యులు సిబ్బంది తెలిపారు. అయితే అనూహ్యంగా శనివారం ఉదయం శిశువులో కదలిక లేకపోవడంతో ఆసుపత్రి సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు పరిశీలించిన అనంతరం శిశువు మృతి చెందినట్లుగా కుటుంబ సభ్యులకు తెలిపినట్లు తెలుస్తోంది. ఈ విషయమై బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నారాయణ రెడ్డి ఈ ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించారు. సంబంధిత గదిలో సీసీ కెమెరాలు ఉన్నాయని వాటిని కూడా పరిశీలిస్తామని, ఏదైనా అంతర్గత సమస్య వల్ల శిశువు మృతి చెందిందా? లేక వైద్యుల, సిబ్బంది నిర్లక్ష్యమా అన్న కోణంలో విచారణ చేస్తామని సూపరింటెండెంట్ ప్రకటించారు.

## కరీంనగర్ కొత్త డీఆర్వోగా జే స్వామి బాధ్యతల స్వీకరణ

**-కలెక్టర్ చిత్రా మిత్రాను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డీఆర్వో**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ మే 30 :** కరీంనగర్ జిల్లా కొత్త రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా జే స్వామి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయనకు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లాలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జే స్వామికి ప్రభుత్వం ఇటీవల పదోన్నతి కల్పించింది. ఈ మేరకు కరీంనగర్ జిల్లా డీఆర్వోగా నియమితులైన ఆయన శనివారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. జిల్లా అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు సమన్వయంతో పనిచేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.నూతన డీఆర్వోను కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు కలిసి అభినందించారు. ఏవోతో పాటు కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌కు చెందిన పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉన్నత చదువులు అభ్యసించాలి...

మొదటి పేజీ తరువాయి... వివాహాల నిర్మూలన, బాలికల హక్కులు, విద్య, వివిధ సామాజిక అంశాలపై సుదీర్ఘ చర్చ చేశారు. అందరికీ ఆయా అంశాలపై అవగాహన వచ్చేలా చక్కగా వివరించారు.అమ్మకు అక్షరమాల కింద చదువు నేర్చుకున్న వారిని సన్మానించారు. మాక్ పార్లమెంట్ లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి నగదు, షీల్డ్ అందించి.. అభినందించారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6 వ తేదీన 99 రోజుల కార్యాచరణ ప్రకటించారని గుర్తు చేశారు. జూన్ 12 వ తేదీ వరకు 10 థీమ్ లతో వివిధ శాఖల ఆద్వర్యంలో వివిధ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థి తాము ఎక్కడి నుంచి వచ్చినా కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలు కలెక్టర్లు, ఎస్పీలు, ఇస్రో, నాసా శాస్త్రవేత్తలుగా, డాక్టర్లు, ఇంజనీర్లు, ప్రొఫెసర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారని గుర్తు చేశారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, పుస్తకాలకు దగ్గరగా ఉండాలని సూచించారు. అనుకున్న ఉద్యోగాలు, రంగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలు షేర్ చేయవద్దని తెలిపారు. పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని, బెల్లం, ఖర్జూర, కోడిగుడ్లు, కూరగాయలు తినాలని సూచించారు. ప్రోటీన్, విటమిన్స్ ఎక్కువ తీసుకోవాలని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు డ్రాప్ ఔట్ కావద్దని, ఉన్నత విద్యాబ్యాసం చేయాలని సూచించారు. స్నేహ సంఘాల విద్యార్థులు ఆరోగ్య, ఆర్థిక, తమకు వచ్చే సమస్యలపై చర్చించాలని తెలిపారు. ఆర్థిక విషయాలపై అవగాహన పొందాలని, బ్యాంక్ అకౌంట్ తీయడం, ఆర్థిక నిర్వహణపై నేర్చుకోవాలని సూచించారు. స్నేహ సభ్యులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

**షి టీమ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి**

మహిళలు, యువతులు, బాలికలు షి టీమ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ మహేష్ బి గితే పిలుపు నిచ్చారు. స్కూల్, కాలేజ్, పని చేసే చోట మహిళలు, విద్యార్థినులు ఏమైనా ఇబ్బందులు ఎదురుకుంటే షి టీమ్ నంబర్ 87126 56425 నంబర్లో సంప్రదించాలని సూచించారు. భరోసా కేంద్రం ద్వారా లీగల్, వైద్య సహాయం, మానసిక కౌన్సెలింగ్ సేవలు అందిస్తారని తెలిపారు. సోషల్ మీడియా ఖాతాలు పబ్లిక్ కాకుండా .. ప్రైవేట్ గా పెట్టుకుని వినియోగించాలని ఎస్పీ సూచించారు.జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి రజిత, పాల్గొన్నారు.

# నీతి, నిజాయితీగా, పారదర్శకంగా విధులు నిర్వర్తించాలి

**మొదటి పేజీ తరువాయి...** సేవల అందజేత, పోలీసు శాఖ పనితీరు మెరుగుదల వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు.ఈ వీడియో సమావేశంలో జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ జిల్లా పోలీసు కార్యాలయం నుండి పాల్గొన్నారు. జిల్లా పరిధిలోని డీఎస్పీలు, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు మరియు ఇతర పోలీస్ అధికారులు తమ తమ కార్యాలయాల నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర డిజిపి సి.వి. ఆనంద్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది తమ విధులను అత్యంత నీతి, నిజాయితీ, పారదర్శకతతో నిర్వహిం చాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి పోలీస్ అధికారికి అత్యంత ముఖ్యమైన బాధ్యత అని పేర్కొన్నారు. పోలీసింగ్లో నిష్పాక్షికత, వృత్తిపరమైన నైపుణ్యం, ప్రజల పట్ల గౌరవభావం ఉండాలని, ప్రతి ఫిర్యాదును సున్నితంగా పరిశీలించి చట్టబద్ధంగా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నేరాల నియంత్రణ, మహిళలు, చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణ, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటూనే బాధితులకు వేగవంతమైన న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి ఆధునిక పోలీసింగ్ను మరింత బలోపేతం చేయాలని, నేరాల దర్యాప్తులో నాణ్యత పెంచాలని పేర్కొన్నారు.అలాగే విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయ పాలన, బాధ్యతాయుతమైన ప్రవర్తన పాటించాలని, శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం, పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, అదే సమయంలో ప్రతి ఒక్కరూ తమ విధులను అంకితభావంతో

## చట్టాలపై యువత అవగాహన కలిగి ఉండాలి

**మొదటి పేజీ తరువాయి....**వరకు అవగాహనా చేసుకోవాలన్నారు. అదేవిధంగా అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు మాట్లాడే తీరును నిశితంగా గమనించాలని అన్నారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, ప్రతి బాలిక ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్య, ఉపాధి, సేవా రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి రఘువరన్, సంబంధిత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏఎస్ఐ రవూఫ్‌కు...

**మొదటి పేజీ తరువాయి...** నిర్వర్తించారన్నారు. విధి నిర్వహణలో ఆయన చూపిన క్రమశిక్షణ, నిబద్ధత యువ పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు .ఉద్యోగ విరమణ అనేది సేవా జీవితానికి ముగింపు మాత్రమేనని, జీవితంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం అని, ఇకపై కుటుంబ సభ్యులతో మరింత సమయం గడుపుతూ ఆరోగ్యవంతమైన, ఆనందభరితమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు.ఆస్ఐ సైదులు, సిబ్బంది పాల్గొని మహమ్మద్ రహూఫ్ కు శుభాకాంక్షలు తెలిపారు.

**సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పై**

## రాజేందర్‌లపై విచారణ జరపాలి

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మే 30 :** సిరిసిల్ల సెస్ చైర్మన్ చిక్కల రామారావు పైన ఉద్యోగులు అబ్దుల్ బారి రాజేందర్‌ల పై విచారణ జరపాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ జస్టిస్ దేవ రాజు నాగార్జున కు వరంగల్ ఎన్పీడీసీఎల్ సిఎండి వర్నాటి కరుణ్ రెడ్డిల కు భారతీయ కిసాన్ సంగ్ రాష్ట్ర ప్రతినిధి ధ్యాపదేవయ్య ఫిర్యాదు చేశారు.

**జూన్ 2లోపు పిఆర్‌సి నివేదిక**

## సీఎంకు సమర్పించండి

**చురకలు విలేఖరి హుజురాబాద్, మే, 30:** రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి రెండోవ పి ఆర్ సి కమిషన్ గా ఎన్ శివశంకర్ కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది దాదాపు రాష్ట్రంలో పనిచేస్తున్న అన్ని ప్రభుత్వ ఉద్యోగ సంఘాలకు చెందిన నాయకులు ఉద్యోగులు ప్రతి ఒక్కరూ వారి వారి శాఖలలో వారికి ఇక్కడ అన్యాయం జరుగుతుంది మరియు ఎక్కడ న్యాయం జరగాలి అని మరియు మాకు రావలసిన ప్రభుత్వం ద్వారా అన్ని రకాల బెనిఫిట్స్ రెండవ వేతన సవరణ కమిటీ చైర్మన్ ఎన్ శివశంకర్ మరియు వారి కమిటీ సభ్యులకు అన్ని రకాల రిప్రజెంటేషన్లో అందించటం జరిగిందని తెలంగాణ కమర్షియల్ టాక్సెస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ తెలియజేస్తూ అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఉద్యోగ సంఘాల నివేదికలను రెండవ పి ఆర్ సి కమిషన్ చైర్మన్ ఎన్ శివశంకర్ అందించటం జరిగింది మరియు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పి అర్ సి



కమిషన్ ఎన్ శివశంకర్ తన వద్ద పూర్తిస్థాయిలో నివేదిక తయారు చేసుకొని ఇన్ని సంవత్సరాల నుండి తన వద్ద పెట్టుకోవడం చాలా బాధాకరమైన విషయం అని తెలంగాణ కమర్షియల్ టాక్సెస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా పిఆర్సి కమిషన్ తయారు చేసుకున్న నివేదికను జూన్ రెండు లోపు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి అందించాలని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ పిఆర్సి కమిషన్ చైర్మన్ ఎన్ శివశంకర్ కు విజ్ఞప్తి చేశారు.ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వేతన సవరణ కమిటీ చైర్మన్ ఎం శివ శంకర్ కు విజ్ఞప్తి చేశారు.

# ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్

## -పిఆర్టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 30 :** రాష్ట్రంలో పని చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని పిఆర్టియు టి ఎస్ రాష్ట్రఅధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి అన్నారు.ఎస్సిఆర్టి అధికారుల ఆమోదం పొంది ఫైల్ ముఖ్యమంత్రి ఆమోదం కొరకు ఉందని, ముఖ్యమంత్రి ఆమోదం పొందిన వెంటనే ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ ప్రభుత్వ నిర్వహిస్తుందని పేర్కొన్నారు.ఇది సంవత్సరానికి మూడుసార్లు నిర్వహిస్తారని ఆయన వెల్లడించారు. పొన్నాల గార్డెన్స్ లో పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయిని పెల్లి ఆనంద్ రావు,యాల్ల అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పదవ తరగతి లో 100శాతం సాధించిన ప్రధానోపాధ్యా యులకు,జిల్లా,మండల టాపర్ విద్యార్థులకు ప్రతిభా అవార్డుల ప్రధానోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై, వారు మాట్లాడుతూ హెల్త్ కార్డ్ ల విషయంలో ఉపాధ్యాయులు కు ఎలాంటి అపోహలు వద్దని ఇది ట్రస్టు ద్వారా నిర్వహించబడుతుందని,ఆ ట్రస్టులో ఉద్యోగ సంఘాలు కూడా సభ్యులుగా ఉన్నారని,దానిపై ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జూన్ 9వ తేదీ వరకు జనాభా లెక్కల ప్రక్రియ పూర్తి అవుతున్నందున జూలై మాసంలో ఉపాధ్యాయులకు బదిలీలతో పాటు పదోన్నతులు కూడా జరుగుతాయని వారన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జగిత్యాల జిల్లా నాలుగో స్థానంలో నిలిచిందని వారన్నారు. గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం తో జరిపిన చర్చల్లో భాగంగా వంద రోజుల్లో ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని వారన్నారు.పిఆర్సి కమిటీ మూడు సంవత్సరాలుగా కాలయాపన చేస్తుందని, పిఆర్సి నివేదికను ప్రభుత్వం వెంటనే తెప్పించు కొని అమలు చేయాలని వారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం అల్పాహారం పాఠశాల విద్యార్థులకు ప్రవేశపెట్టడం అభినందనీయమని వారన్నారు.జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనపట్ల దినేష్ మాట్లా డుతూ,ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని ఉపాధ్యాయ వృత్తి పట్ల తనకు గౌరవం ఉందని,రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యాశాఖ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని, వారి కృషివలనే రాష్ట్రంలో నియోజకవర్గానికి ఒకటి పబ్లిక్ స్కూల్, ఇంటిగ్రేటెడ్ స్కూలు ఏర్పాటు చేస్తున్నారని వారన్నారు. ప్రైవేట్ పాఠశాల వలె ప్రభుత్వ పాఠశాలలో కూడా ప్రీ ప్రైమరీ ప్రభుత్వం ప్రవేశపెట్టడం అభినందనీ యమని వారన్నారు.జిల్లా విద్యాధికారి రాము మాట్లాడుతూ ప్రధానోపాధ్యా యులు,ఉపాధ్యాయుల కృషి వల్లనే ఈరోజు ఉత్తమ ఫలితాలు సాధించా మనివారన్నారు.పిఆర్టియుటిఎస్ జగిత్యాల జిల్లా శాఖ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులకు ప్రతిభ అవార్డు ప్రధానోత్సవం కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం 50 మంది జిల్లా మరియు మండల టాపర్ విద్యార్థుల ను సన్మానించారు.100 శాతం సాధించిన 178 మంది జిల్లా పరిషత్ పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలు కేజీబీవీ మోడల్ స్కూల్ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ బీసీ వెల్ ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ సోషల్ వెల్ఫేర్ ప్రధానోపాధ్యాయులను మరియు ప్రిన్సిపాల్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు టిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మే (30) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో కోరుట్ల నియోజకవర్గ టిపిసిసి డెలిగేట్ శ్రీ కల్వకుంట్ల సుజిత్ రావు అదేశలమేరకు తెలంగాణ రాష్ట్ర ఐటి శాసన సభ వ్యవహారాల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కొడిమ్యాల దీపక్ రాజ్ , ఇబ్రహీంపట్నం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నల్లూరి సాగర్, సేవాదళ్ అధ్యక్షులు ముత్యం రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బైండ్ల శ్రీకాంత్, దాసరి మోహన్,పిట్టల వెంకటేష్, కనుక దినేష్,బాస సాయన్న, లక్ష్మణ్, సాగర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## సీడ్‌బాలు తయారు విధానంపట్ల అవగాహన



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మే (30) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలంలోని పకీర్ కొండాపూర్ గ్రామంలో శనివారం పాఠశాలలో సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు సీడ్ బాలు తయారు విధానంపైన అవగాహన కల్పించారు.భవిష్యత్తు తరాలకు ఎంతో ఆదర్శంగా ఉంటుందని గ్రామసర్పంచ్ తోట రమేష్,వార్డ్ మెంబర్ శ్రీనివాస్, సింగని మారుతి పంచాయతీ సెక్రెటరీ రాజశేఖర్ పిల్లలకు ఇలాంటి కార్యక్రమాలు నేర్పడం వల్ల పర్యావరణాన్ని భవిష్యత్తులో అభివృద్ధి చెందుతుందని భావిస్తూ ఉపాధ్యాయుల బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో విధ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు భక్తుల రద్దీ



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 30 :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. తెల్లవారుజామున కోనేరు లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే క్షేత్రపాలకుడైన శ్రీ బేతలస్వామి వారిని కూడా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి సుమారు 30 వేల మంది భక్తులు విచ్చేసినట్లు అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఉప ప్రధాన అర్చకులు రంగయ్య,ముఖ్య అర్చకులు చిన్న మారుతి, పెద్ద రాము, పవన్,అభిలష్ లు భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ ఎస్.అంజనారెడ్డి భక్తులకు ఇలాంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించారు.ఏఈఓ హరిహర్నాథ్, సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, సునీల్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బాధితుడికి ఆర్థిక సహాయం



**చురకలు విలేకరి, మల్లాపూర్, మే 30 :** మల్లాపూర్ మండలంలోని వెంపెల్లి గ్రామానికి చెందిన హోటల్ లష్మయ్య కొంత కాలంగా పక్షవాతం వ్యాధితో బాధపడుతుండగా ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం మాజీ సర్పంచ్ బిట్ల సరోజన 5000 రూ. ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కల్లెడ గంగాధర్, దానవేణి శేఖర్, మ్యాకాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి మాక్ పార్లమెంట్‌కు ఎంపికైన విద్యార్థిని శ్రీనిత్య



**చురకలు, విలేఖరి, విలేఖరి,మే 30 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థిని చిలువేరి శ్రీనిత్య రాష్ట్ర స్థాయి మాక్ పార్లమెంట్ పోటీ కి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్ తెలిపారు.ఇటీవల ఈ విద్యార్థిని జాతీయ స్థాయి యువిక కార్యక్రమంలో 15 రోజులపాటు పాల్గొనివచ్చిన తర్వాత మోడల్ స్కూల్ పిజిటి కామర్స్ అధ్యాపకురాలు ప్రేమలత గైడ్ ఆధ్వర్యంలో చిన్నారి చిలువేరి శ్రీ నిత్య మాక్ పార్లమెంట్ కు ప్రిపేర్ చేయడం తో శనివారం జగిత్యాల జిల్లా స్థాయిలో ప్రతిభ కనభరిచి రాష్ట్రస్థాయి మార్లమెంటుకు సెలెక్ట్ కావడం జరిగిందని తెలిపారు.మోడల్ స్కూల్ లో పనిచేసే ఉపాధ్యాయులు, విద్యార్థులమధ్య సమన్వయం తో పాటు తల్లి దండ్రుల ప్రోత్సాహంమే ఈ అద్భుత అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చు కోవడం జరుగు తుందని,రాష్ట్ర స్థాయి మాక్ పార్లమెంట్ కు ఎంపికైన విద్యార్థిని శ్రీనిత్య ను ప్రిన్సిపల్, అధ్యాపక బృందం పలువురు అభినందించారు.

## మాజీ మంత్రికి పరామర్శ



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 30 :** మాజీ మంత్రి గొడిసెల రాజేశం గౌడ్ కు ఇటీవలే మోకాలు శస్త్రచికిత్స జరుగగా ఆయనను శనివారం జగిత్యాల మాజీ జడ్పి చైర్పర్సన్ దావ వసంత సురేష్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ జిఆర్. దేశాయి తదితరులున్నారు.

## 6 నెలల కష్టం.. 66 గోసలు.. కన్నీరు పెట్టిస్తున్న రైతన్న పాట

### -సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పాట

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 30 :** చేతికొచ్చిన పంటను కొనేవాళ్లే లేరంటూ జగిత్యాల జిల్లా మల్యాల మండలం సర్వాపూర్ లో ఓ రైతు పాట రూపంలో కళ్లకు కట్టినట్టుగా వివరించారు. రైతుగా పుట్టాను,రైతుగానే పెరిగాను. రాజకీయం నేను చేస్తే ఇబ్బందులు ఉండవేమో.ఆరు నెలల కష్టంలో 66 గోసలు పడి పండించిన పంటను కొనేవారే లేరయ్యా. రైతు బతుకు చూడరో అంటూ అందరినీ కన్నీరు పెట్టించాడా రైతు. రెక్కల కష్టానికి ఫలితం దక్క లేదని వివరించిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

## అంజన్నను దర్శించుకున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 30 :** జగిత్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారిని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ ముఖ్య అర్చకులు పెద్ద రాము,పవన్‌లు స్వస్తి వేదమంత్రాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు.స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన తరువాత అర్చకులు శేష వస్త్రం కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు.ఈ కార్యక్రమంలో టెంపుల్ సూపరింటెండెంట్ ఉపాధ్యాయుల చంద్ర శేఖర్, టెంపుల్ ఇన్స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్, ఏఎస్ఐ చిలుక శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధిత గౌడ కుటుంబాలకు పరిహారం అందించాలి

### -జగిత్యాల జిల్లా కలెక్టర్‌ను కలిసిన : కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



**చురకలు ప్రతినిధి కోరుట్ల మే 30 :** కోరుట్ల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదాల వల్ల భారీ సంఖ్యలో ఈత చెట్లు దగ్ధమై జీవనాధారం కోల్పోయిన గౌడ కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని కోరుతూ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శనివారం జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెట్‌పల్లి మండలంలోని మెట్ల చిట్టాపూర్, పెద్దాపూర్, కొనరావు పేట, కోరుట్ల మండలంలోని సంగెం, ఐలాపూర్ మాధాపూర్, చిన్నమెట్‌పల్లి, మోహన్‌రావుపేట, కోరుట్ల పట్టణ పరిధి, ఇబ్రహీంపట్నం మండలంలోని ఫకీర్‌కొండాపూర్ తదితర గ్రామాల్లో తీవ్ర ఎండల కారణంగా అగ్ని ప్రమాదాలు సంభవించి సుమారు 18,100 ఈత చెట్లు దగ్ధమయ్యాయని తెలిపారు. ఈ ఘటనలతో వందలాది గౌడ కుటుంబాలు తమ ప్రధాన జీవనాధారాన్ని కోల్పోయి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు రెవెన్యూ, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో వెంటనే నష్ట అంచనా సర్వే నిర్వహించి తగిన పరిహారం మంజూరు చేయాలని కోరారు. అలాగే భవిష్యత్తులో ఇటువంటి అగ్నిప్రమాదాల ప్రభావాన్ని తగ్గించేందుకు అగ్నిప్రమాదాలు సంభవించిన గ్రామాల్లోని ఈత వనాల వద్ద ప్రత్యేకంగా వాటర్ బోర్లు మంజూరు చేసి నీటి సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ సానుకూలంగా స్పందించి, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు చేపడతామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

### -జిల్లా అదనపు కలెక్టర్ బి.రాజా గౌడ్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 30 :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజా గౌడ్ ఆదేశించారు. జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లు, నిర్వహణపై కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం జిల్లా స్థాయి అధికారులతో అదనపు కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించనున్న వేడుకలకు సీటింగ్ ఏర్పాట్లు, ఇతర అన్ని కార్యక్రమాలు ప్రోటోకాల్కు అనుగుణంగా పక్కాగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, విద్యార్థులకు, అధికారులు ప్రజలందరికీ తగిన వసతులు సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ప్రతిబింబించేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా మండలాలు, గ్రామ స్థాయిలో కూడా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆహ్వానితులందరికీ ఆహ్వానాలు అందేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ బి.రాజగౌడ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, కలెక్టరేట్ ఏ.వో కిషన్, డిపివో మదన్ మోహన్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజ్ కుమార్, జిల్లా వైద్య శాఖ అధికారిణి సుజాత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కిషోర్, ఈఈపిఆర్ లక్ష్మణ్ రావు, ఆర్ అండ్ బి ఈఈ శ్రీనివాస్, మెప్మా ఏఓ శ్రీనివాస్, ఎస్.కే.ఎన్.ఆర్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ అశోక్, సమగ్ర శిక్ష ప్లానింగ్ కో – ఆర్డినేటర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ చైర్ పర్సన్‌ను కలిసిన

# నూతన కార్యవర్గం




**చురకలు విలేకరి, జగిత్యాల, మే 30 :** జగిత్యాల పట్టణంలోని మేరు సేవా సంఘం నూతనంగా ఎన్నికైన కార్యవర్గం సభ్యులు మాజీ చైర్పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను అభినందించిన మాజీ చైర్పర్సన్ సంఘ అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు రాపర్తి వినోద్, ఉపాధ్యక్షుడు రాగిళ్ల నారాయణ, ప్రధాన కార్యదర్శి గట్ల శ్రీనివాస్, కోశాధికారి గట్ల శ్రీకర్, సహాయ కార్యదర్శి రాగిళ్ల శ్రీధర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# తండ్రి జ్ఞాపకార్థం క్రికెట్ బ్యాట్ల వితరణ



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, మే 30 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో స్థానిక యువతను క్రీడల పట్ల ప్రోత్స హించాలనే ఉద్దేశంతో కీ, శే. పెద్ది గౌరయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు పెద్ది సురేష్, శ్రీనివాస్, సంతోష్ లు శనివారం ఉచితంగా క్రికెట్ బ్యాట్లను యువతకు అందజే శారు. వేసవిలో యువతను క్రీడల వైపు మళ్లించేందుకు తీసుకున్న ఈ నిర్ణయంపట్ల క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ మేరుగు మురళీ గౌడ్, ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గండ్ర ప్రతాప్ రావు వార్డ్ మెంబర్లు గుండాటి సందీప్ రెడ్డి, నక్క సురేష్, బీసీ సెల్ అధ్యక్షుడు బందెలఉదయ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జూపాక ప్రవీణ్ వీర, నాని, గనియూత్ సభ్యులు వెలగందుల సంతోష్, గుమ్ముల అజయ్, గడ్డం మనోజ్, మూగల సంతోష్, సూర స్వామి, కొండ లక్ష్మీనారాయణ, స్థానిక క్రీడాకా రులు మేకల వికాస్, రాజేందర్, మోతే సాయి, జెట్ల అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ మాట అంగన్వాడి బాట




**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మే (30) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని తిమ్మపుర్, వర్షకోండ గ్రామలలో శనివారం ప్రజా పాలన భాగంగా అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమన్ని అంగన్వాడీ టిచర్లు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ర్యాలి నిర్వహించి అంగన్వాడీ కేంద్రల లో పిల్లలను చెర్పించాలని, ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం అందించే తదితర వనరులు పట్ల అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు బస శ్రావణ్, పోనుకంటీ వెంకట్, మాజీ వైస్ ఎంపీపీ నోముల లక్ష్మరెడ్డి, అంగన్వాడీ టిచర్ లు గిరిజ, రత్న మాల, ఎస్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల పట్టణం మండలంలో ప్రీ-ప్రైమరీ తరగతుల ప్రారంభం



**చురకలు ప్రతినిధి కోరుట్ల మే 30 :** కోరుట్ల పట్టణం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విద్యను విస్తరించేందుకు ఈ విద్యా సంవత్సరంలో నాలుగు కొత్త ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభిస్తున్నట్లు మండల విద్యాధికారి గంగుల నరేశం శనివారం తెలిపారు. కోరుట్ల పట్టణంలోని ఎస్ఆర్ఎస్పీ గడి ప్రాథమిక పాఠశాల, పైడిమడుగు ప్రాథమిక పాఠశాల, నాగులపేట ప్రాథమిక పాఠశాల, ధర్మారం ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ తరగతులు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచడం, చిన్నారులకు నాణ్యమైన ప్రాథమిక విద్య అందించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ పాఠశాలల్లో చిన్నారులకు అనుకూలంగా ఆకర్షణీయమైన తరగతి గదులు, ఆట వస్తువులు విద్యా బొమ్మలు, ఫర్నిచర్ తదితర సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని తెలిపారు. అలాగే బోధన కోసం ప్రత్యేకంగా ఉపాధ్యాయులు, ఆయాలను నియమించనున్నట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను ప్రభుత్వ ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాధికారి కోరారు.

## ఘనంగా మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు



**చురకలు విలేకరి, మెట్ పల్లి, మే 30 :** తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని ఘనంగా కేక్ కోసి మిఠాయిల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు స్ఫూర్తితో రాజకీయాల్లో తనదైన శైలిలో స్థానం సంపాదించుకొని తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ బడుగు బలహీన వర్గాల ఆశీస్సుల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న నాయకులు శ్రీధర్ బాబు అని కొనియాడారు ఇట్టి కార్యక్రమంలో లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు అల్లాల సత్యనారాయణ, పట్టణ వైశ్య సంఘం ప్రతినిధి కాంగ్రెస్ సీనియర్ నాయకులు దొంతుల వెంకటేష్, ప్రముఖ తూర్పు రాములు న్యాయవాది కీర్తి, దినేష్, సీనియర్ రిటైర్డ్ కార్యదర్శులు కుందేళ్ళ మురళి, సుభాష్, పుప్పాల శంకర్, బద్దం అంజిరెడ్డి, 11వ వార్డు బిసి నాయకులు ఏషాల రాజశేఖర్ రెడ్డి, చింతల పేట మల్లేశం, మైనార్టీ సీనియర్ నాయకులు అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

# డేంజర్ జోన్ ప్రజలకు ఊరటనిచ్చిన మంత్రి శ్రీధర్ బాబు

**-రూ.261 కోట్ల నిధుల మంజూరుపై తాడిచెర్లలో పాలాభిషేకం**

**చురకలు ప్రతినిధి,మల్హర్ రావు,మే 30 :** తాడిచెర్ల గ్రామంలోని డేంజర్ జోన్‌లో నివసిస్తున్న భూనిర్వాసిత కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ తీసుకుని రూ.261 కోట్ల నిధులు మంజూరు చేయించడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం గ్రామంలో ఘనంగా పాలాభిషేక కార్యక్రమం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు.తాడిచెర్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు, మహిళలు, యువకులు



పెద్ద ఎత్తున పాల్గొని మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు కేసారపు చంద్రయ్య పాలాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించి మంత్రి సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా కేసారపు చంద్రయ్య మాట్లాడుతూ డేంజర్ జోన్‌లో సంవత్సరాలుగా భయాందోళనల మధ్య జీవిస్తున్న ప్రజల సమస్యలను మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. జెన్‌కో అధికారులతో ప్రత్యేకంగా చర్చలు జరిపి నిర్వాసిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. గ్రామ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రభుత్వం రూ.261 కోట్ల నిధులు మంజూరు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు.ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న సమస్యకు పరిష్కార మార్గం చూపిన మంత్రి శ్రీధర్ బాబుపై గ్రామ ప్రజలకు ప్రత్యేక అభిమానం ఉందన్నారు.డేంజర్ జోన్ సమస్య పరిష్కారంలో మంత్రి శ్రీధర్ బాబు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ అధికారులతో సమన్వయం కొనసాగించారని తెలిపారు.నిర్వాసిత కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తాడిచెర్ల సర్పంచ్ బండి స్వామి, ఉపసర్పంచ్ బొబ్బిలి రాజు,యువ నాయకులు బండి రణధీర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, యువకులు,గ్రామ పెద్దలు,నిర్వాసిత కుటుంబాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం

**-ఎల్లారెడ్డిపేట మండల విద్యాధికారి కృష్ణ హరి**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మే 30 :** ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ ప్రజా ప్రభుత్వం రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయం తీసుకుందని పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేట ,తిమ్మాపూర్ అగ్రహారం,గ్రామాలలో



ఇప్పటికే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్య అమల్లో ఉండగా తాజాగా 2026-27 విద్యా సంవత్సరం లో మరో ఆరు గ్రామాలలోనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ విద్యను అందించడానికి ప్రభుత్వం అనుమతించిందని మండల విద్యాధికారి గాలిపెల్లి కృష్ణ హరి తెలిపారు. బొప్పాపూర్ కిషన్ దాస్ పేట నారాయణపూర్ బండలింగం పల్లి దుమాల వెంకటాపూర్ గ్రామాలలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగు సంవత్సరాల వయసు నిండిన పిల్లలను చేర్పించి ప్రీ ప్రైమరీ (నర్సరీ,ఎల్ కే జీ యూకేజీ) విద్యను అందించడానికి జూన్ 12నుండి తరగతులు నిర్వ హించబడునని 9 గ్రామాల ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ప్రభుత్వ ప్రీ ప్రైమరీ విద్యను వినియోగించుకొని తమ పిల్లలకు మంచి భవిష్యత్తును అందించాలని మండల విద్యాధికారి సూచించారు.

# గ్రామ గ్రామాన మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్, మే 30 :** రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు  మండల కేంద్రంతో పాటు గ్రామ గ్రామాన శనివారం కాంగ్రెస్ శ్రేణులు సర్పంచ్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.మండల కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు సయ్యద్ సయిూద్ అన్వర్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్ ఎస్ అన్వర్ ,ఏఎంసీ చైర్మెన్ వైనాల రాజు భాస్కర్ రావు,సర్పంచ్‌లు రంగు సత్యనారాయణ ,శీలారపు మల్లయ్య,బొంగోని సదయ్య, బంగారి కళ్యాణి-మహేష్,పొనగంటి కుమార్,గుమ్మడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**సిద్ది పల్లెలో**

మండలంలోని సిద్ది పల్లె గ్రామ పంచాయతీ పరిధిలో గల శాలపల్లె లో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. సిద్ధిపల్లె కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ



అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గ్రామ సర్పంచ్ బంగారు కళ్యాణి మహేష్, కొలిపాక వెంకన్న, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంగారు మహేష్,ఉప సర్పంచ్ కొత్తపల్లి సతీష్, కాంగ్రెస్ నాయకులు చిప్ప రాజ్‌కుమార్, సుంచు శ్రీనివాస్,నామని శ్రీకాంత్, గడ్డం వెంకటేష్‌తదితరులు పాల్గొన్నారు.

**కూలీలకు మజ్జిగ పంపిణీ**

పుట్టినరోజు సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ మరియు ఓ ఆర్ ఎస్ప్యాకెట్లను పంపిణీ చేశారు.

**అంబలి పంపిణి**

వేసవి తీవ్రత నేపథ్యంలో ప్రజలకు చల్లదనాన్ని అందించాలనే లక్ష్యంతో ఛత్రపతి శివాజీ యువసేన అధ్యక్షులు మల్యాల శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిత్య అంబలి పంపిణి కార్యక్రమం శనివారం ప్రత్యేకంగా నిర్వహించబడింది.తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదినాన్ని పురస్కరించు కుని ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధిపల్లె ఉపసర్పంచ్ కొత్తపల్లి సతీష్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు అంబలి పంపిణి చేశారులి. వేసవి వేడిలో ప్రజలకు ఉపశమనం కలిగించేలా నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానిక ప్రజల ప్రశంసలు అందుకుంది.మంత్రి శ్రీధర్‌బాబు తెలంగాణ రాజకీయాల్లో ప్రజలకు చేరువైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తూ యువత ఉపాధి, పారిశ్రామిక ప్రగతి, సాంకేతిక రంగ అభివృద్ధిపై ప్రత్యేక



దృష్టి సారిస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది.అంబలి పంపిణి కార్యక్రమానికి సహకరించిన సిద్దిపల్లె ఉపసర్పంచ్ కొత్తపల్లి సతీష్‌కు ఛత్రపతి శివాజీ యువసేన సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగించాలని వారు ఆకాంక్షించారు.ఛత్రపతి శివాజీ యువసేన అధ్యక్షులు మల్యాల శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ నిత్య అంబలి పంపిణి కార్యక్రమం నిరంతరం కొనసాగుతోంది. సేవాభావంతో ప్రతి రోజు ప్రజలకు అంబలి పంపిణి చేస్తూ యువసేన సభ్యులు ప్రజల ఆదరణ పొందుతున్నారు.

## ఫిట్ సెక్రటరీ ఆధ్వర్యంలో మంత్రి పుట్టినరోజు వేడుకలు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మే 30 :** సింగరేణి సంస్థ ఆర్జీ టు పరిధిలోని వకీల్ పల్లె గాని ఫిట్ సెక్రటరీ గోపాల భూమయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు యొక్క జన్మదిన వేడుకలు కమాన్ పూర్ క్రాస్ రోడ్డు గుండారం వద్ద శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పలువురు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఐకెపి ఫిట్ సెక్రటరీ గోపాల భూమయ్య,ఆధ్వర్యంలో గుండారం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పిడుగు శంకర్,ఉండాల మాజీ సర్పంచ్ లు ఆకుల ఓదెలు,పిడుగు నరసయ్య, అడువాలా చంద్రయ్య,గుండారం మాజీ ఉపసర్పంచ్ అంబిరి రాజేందర్, వార్డు సభ్యులు దామర దేవయ్య,బొడ్డు రవి, పిడుగు ఎల్ఐసి సది . నాయకులు ముదాం కొమురయ్య,ముకుంద శ్రవణ్, వడ్లకొండ మల్లేష్,వడ్లకొండ అభి, తదితరులు పాల్గొన్నారు.

## ఐకెపి ఆధ్వర్యంలో మహిళలతో అక్షరాస్యత ర్యాలీ




**చురకలు ప్రతినిధి, మంచిర్యాల, మే 30 :** బెల్లంపల్లి మండలంలోని తాళ్ల గురజాల గ్రామపంచాయతీలో శనివారం ప్రతిష్టాత్మకంగా 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు బెల్లంపల్లి మండల సమాఖ్య, మారుతి గ్రామ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి వికలాంగుల సభ్యురాన్ని ఎన్నుకొన్నారు.గ్రామస్థాయిలో పనిచేస్తున్న సీసీలతో పాటు, ఇబ్బందిని సన్మానించారు. అక్షరాస్యత కలిగిన సమాజం ఆవిర్భవించడంలో అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో భాగంగా అక్షరాస్యులైన మహిళలను సన్మానించారు. అనంతరం మహిళలకు సమస్యలపై, అక్షరాస్యత అభివృద్ధిపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో గ్రామ సర్పంచ్ రామన్న గౌడ్, ఉప సర్పంచ్ నరేష్, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ విజయలక్ష్మి, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు రామకృష్ణ, సుందరేష్, ప్రసాద్, గ్రామ సంఘం బాధ్యులు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

## ఉచిత కుటుంబ సలహా కేంద్రం ప్రారంభం



**చురకలు ప్రతినిధి, మంచిర్యాల, మే 30 :** బెల్లంపల్లి మండల సమైక్య ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ పక్కన శనివారం ఉచిత కుటుంబ సలహా కేంద్రాన్ని ప్రారంభించారు. మండల సమైక్య సభ్యురాలు, సోషల్ యాక్షన్ కమిటీ సభ్యులైన పుష్పలత, ఏపీఎం విజయలక్ష్మి, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు కలిసి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను, భార్యాభర్తల వద్ద జరిగే గొడవలను, వృద్ధుల సమస్యలను, శివరాత్రి బాలికల సమస్యలను తీసుకొని కౌన్సిలింగ్ చేయనున్నట్లు వారు తెలిపారు.ప్రతిరోజు కేసులను రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈ కేంద్రంలో ఒక మహిళా సభ్యురాలు అందుబాటులో ఉంటారని తెలిపారు. వివరాలకు సోషల్ యాక్షన్ సభ్యురాలు పుష్పలత 9542596161,అకౌంటెంట్ తిరుమల 9441048795లను సంప్రదించాలని కోరారు.

# జూన్ 2న డిపెండెంట్లకు నియామక పత్రాలు ఇవ్వాలి

## -లేదంటే 3న ధర్నా : ఏఐటీయూసీ హెచ్చరిక



**చురకలు ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి మే 30 :** జూన్ 2న జరిగే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాడే, మెడికల్ అన్‌ఫిట్ పొందిన 400 మంది సింగరేణి కార్మికుల పిల్లలకు డిపెండెంట్ ఉద్యోగ నియామక పత్రాలు అందజేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని కొమురయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో జూన్ 3న అన్ని జీఎం (GM) కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహిస్తామని, అప్పటికీ సమస్య పరిష్కారం కాకుంటే జూన్ రెండో వారంలో సమ్మెకు పిలుపు నిస్తామని హెచ్చరించారు. ఇటీవల ఉపముఖ్యమంత్రి, కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని రాజ్ కుమార్ తెలిపారు. కారుణ్య నియామకాలు, డిపెండెంట్ ఉద్యోగ నియామకాలను పాత విధానంలోనే కొనసాగించాలి. మారుపేరు సమస్య, 1982-83లో ఎంప్లాయ్‌మెంట్ కార్డులపై మారుపేర్లతో ఉద్యోగం పొందిన కార్మికుల సమస్యను పరిష్కరించాలి. బకాయిల చెల్లింపు సింగరేణికి ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.56వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలి. పన్ను రద్దు, పింఛన్ పెరుక్స్ (Perks) పై ఇన్‌కమ్ టాక్స్ రద్దు చేయాలి. గతంలో గోల్డెన్ స్కీమ్ ద్వారా రిటైర్ అయి, కేవలం రూ.1000 పింఛన్ పొందుతున్న కార్మికులకు 'ఆసరా' పింఛన్, ఇతర ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి. కార్మికుల సొంతింటి పథకాన్ని కూడా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూన్ 3న జరిగే ధర్నా కార్యక్రమానికి డిపెండెంట్ ఉద్యోగులు, కార్మికులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని రాజ్ కుమార్ పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు గురుజేపెల్లి సుధాకర్ రెడ్డి, ఆసిఫ్ పాషా, తోట రామ్ చందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

# రేణిగుంటలో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ మే 30 :** తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామంలో ఈరోజు 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళి భాగంగా అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమంను అంగన్వాడీ సెంటర్ లో జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతు పిల్లలను అంగన్వాడీ కేంద్రముకు పంపించాలని ఆటపాటలతో విద్య అనేది నేర్పడం జరుగుతుందాని, గర్భవతులకు, బాలింతలకు,పిల్లలకు మంచి పౌష్టికాహారంను అందిస్తున్నారాని తెలిపారు, అమ్మ మాట అంగన్వాడీ బాట ర్యాలీ చేసి పిల్లలకు యూనిఫామ్ పంపిణి చేసి 5o ప్రైమరీకి వెళ్లే పిల్లలకు విద్యారంభం ఈ.సి.సి.ఈ ధ్రువీకరణ పత్రం,అందజేశారు కార్యక్రమంలో సర్పంచ్ ఎలుక అంజనేయులుగారు, కనపర్తి చంద్రశేఖర్ తమ్మనవేణి శ్రీనివాస్ యాదవ్ సీడీపీఓ మేడం,గ్రామ పెద్దలు, గోనెల సంపత్, తిర్మలయ్య తల్లులు, టీచర్లు స్వరూప,రజిత తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు

**చురకలు ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి, మే 30 :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సింగరేణి భవనంలో భూపాలపల్లి టౌన్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ అనంతరం పట్టణ అధ్యక్షులు దేవన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కీ వెన్నుముక శ్రీధర్ బాబు,ప్రభుత్వంలో ఉన్న పతిపక్షంలో ఉన్న ప్రత్యేకత వేరు, ప్రజలకు శ్రీధర్‌బాబు అంటే ఒక నమ్మకం ఒక అభయం అని అన్నారు. ఒకసారి గెలవడానికే ఆపసోపాలు పడే నాయకులు ఎందరో కానీ ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలవడం అంటే మాములు విషయం కాదనీ,మంథని ప్రజల గుండె చప్పుడు శ్రీధర్ బాబు అని అన్నారు. అనుకోకుండా ఆ కుటుంబములో ఒక సంఘటన జరిగిన తర్వాత రాజకీయ అరగ్రేటం చేసినప్పటి నుండి ఈరోజు వరకు ప్రజల కొరకు అనునిత్యం పాటు పడే నాయకులు శ్రీధర్ బాబు అని అన్నారు ,ప్రభుత్వం ఏర్పాటు జరిగిన తర్వాత ఐటీ శాఖ మంత్రి గా లక్షల కోట్ల రూపాయలు, విదేశీ పెట్టుబడులు తేవడం లో కీలక పాత్ర పోషించడం జరిగిందనీ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సారథి గా చూడాలని ఉందని దేవన్ తెలిపారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐ ఎన్ టి యు సి నాయకులు కౌన్సిలర్లు మహిళలు తదితరులు పాల్గొన్నారు.




# ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణి ప్రారంభించిన మున్సిపల్ వైస్ చైర్మన్



**చురకలు ప్రతినిధి,నిర్మల్, మే, 30 :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఈ రోజు పలు ప్రాంతాల్లోనీ బుధవార్పేట్, విశ్వనాథ్ పెట్, మోచి సంఘంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణి కార్యక్రమాన్ని నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ప్రారంభించారు. అర్హులైన మహిళల కు చీరలను అందజేస్తూ, ప్రభుత్వం మహిళల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు ఈ కార్యక్ర మంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని చీరలను స్వీకరించారు. ప్రభుత్వం సాయం పట్ల మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఇమ్రానుల్లా, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నాందేడపు. చిన్ను, కో -ఆప్షన్ సభ్యులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# విశిష్ట సేవలకు ఘన సత్కారం

## -పదవి విరమణ పొందుతున్న పోలీసు అధికారులకు వీడ్కోలు పలికిన ఎస్పీ



**చురకలు ప్రతినిధి,నిర్మల్, మే, 30 :** నిర్మల్ జిల్లా కేంద్రంలోనీ పోలీసు అధికారులు రేపుఅనగా 31.05.2026 రోజున పదవి విరమణ పొందనున్న జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి, జిల్లా ఎస్పీ.జానకి షర్మిల వారిని ఘనంగా సత్కరించి,వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడు తూ 1983 లో గంగాధర్ కానిస్టేబుల్ గా నియామకమై, తర్వాత కాలంలో ఎస్సైగా పదోన్నతి పొంది, ప్రస్తుతం నిర్మల్ టౌన్ లో ఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్నారు. దాదాపుగా 43 సంవత్సరాలు,1989 బ్యాచ్ కి చెందిన ఎస్.సుదర్శన్ (ఏ.ఎస్.ఐ) భైంసా టౌన్, 37 సంవత్సరాలు,1989 బ్యాచ్ కి చెందిన ఎమ్.గణేష్(ఏ.ఎస్.ఐ),నిర్మల్ టౌన్,37 సంవత్సరాలు,1990 బ్యాచ్ కి చెందిన కె.వి.రాజా రెడ్డి,(హెడ్‌కాని స్టేబుల్),లోకేశ్వరం పోలీస్ స్టేషన్,36 సంవత్సరాలు,1990 బ్యాచ్‌కి చెందిన బి.మల్లేశ్వర్(హెడ్ కానిస్టేబుల్), మామడ పోలీసు స్టేషన్,36 సంవత్సరాలు పోలీసు శాఖలో విశిష్ట సేవలు అందించి నేడు పదవి విరమణ చేయడం తీరనిలోటు అన్నారు. వారు పోలీసు శాఖకు అందించిన సేవలు మారువలేనివని వారి సేవలను కొని యాడారు. రిటైర్మెంట్ అనంతరం పోలీసు శాఖ నుండి వారికి రావలసిన అన్ని రకాల రిటైర్మెంట్ బెన్ఫిట్స్ సకాలంలో అందేవిధంగా చూస్తామని, రిటైర్మెంట్ అనంతరం కూడా ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని, మిగిలిన శేష జీవితం అతని కుటుంబంతో సంతోషంగా, ఆరోగ్యంగా గడపాలని కోరుకుంటున్నాను అని అన్నారు. జిల్లా పోలీస్ శాఖ తరపున వారికి,వారి కుటుంబాలకు ఎల్లవేళలా సహాయ, సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ.జానకి షర్మిల తో పాటు జిల్లాఅదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఏవో యూనస్ అలీ, ఆర్.ఐ రామ్ నిరంజన్ రావ్, ఇతర పోలీసు సిబ్బంది, రిటైర్డ్ అవుతున్న కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### సోమవారం జిల్లా వ్యాప్తంగా

# ఇందిరమ్మ ఇండ్ల సామూహిక గృహప్రవేశాలు

## -పండగ వాతావరణంలో ఇండ్లను ప్రారంభించాలి
## -కలెక్టర్ గరిమ అగ్రవాల్
## -మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓ లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్



**చురకలు ప్రతినిధి సిరిసిల్ల, మే 30 :** వచ్చే నెల 1 వ తేదీన (సోమవారం) జిల్లా వ్యాప్తంగా నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల సామూహిక గృహ ప్రవేశాలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని, పండగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సామూహిక ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవాలకు చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లాలోని అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓ లతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శనివారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమంలో భాగంగా జిల్లాలో అర్హులైన వారిని ఎంపిక చేసి ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పూర్తి చేయడంలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా ద్వితీయ స్థానంలో ఉందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా సోమవారం మొత్తం 2750 ఇందిరమ్మ ఇండ్లను గృహ ప్రవేశాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం అన్ని మండలాలు, గ్రామాల్లో పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని, సంబంధిత మండల ప్రత్యేక అధికారి బాధ్యత తీసుకుని కార్యక్రమాలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చూడాలని ఆదేశించారు. అన్ని ఇండ్లను పూలతో ముస్తాబు చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అన్నారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవాల్లో ప్రజాప్రతినిధులను, ఇందిరమ్మ కమిటీ సభ్యులను భాగస్వామ్యం చేయాలని అన్నారు. అందరికీ ముందుగానే సమాచారం అందించాలని సూచించారు. సమన్వయంతో పని చేసి సామూహిక ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.

# అంగన్వాడీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మే 30 :** అంగన్వాడి కేంద్రాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది అని కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ అన్నారు. మంథని సీడీపీఓ పుష్పలత ఆధ్వర్యంలో చిన్నారులకు యూనిఫారాలను అందజేశారు.రాష్ట్ర ప్రభుత్వము నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అంగన్వాడి విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేస్తున్నట్లు మంథని ఐ.సి.డి. ఎస్ సీ.డీ.పీ.ఓ ఉప్పులేటి.పుష్పలత అన్నారు. మండల కేంద్రమైన కమాన్ పూర్ లో శనివారం స్థానిక సర్పంచ్ రంగు సత్యనారాయణతో కలిసి చిన్నారులకు స్కూల్ యూనిఫామ్ లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పల్లె అనిత, అంగన్వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, కుమారి నాగసరోజన తదితరులు పాల్గొన్నారు. పెంచికల్‌పేట్ గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో చదువుతున్న చిన్నారులకు గ్రామ సర్పంచ్ పల్లె మాధవి-నారాయణ ఆధ్వర్యంలో యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిన్నారుల విద్యాభివృద్ధి, వారి సంక్షేమం కోసం గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. అంగన్వాడి దశ నుంచే పిల్లల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో యూనిఫామ్‌లు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. యూనిఫామ్‌లు అందుకున్న చిన్నారులు ఆనందం వ్యక్తం చేయగా, వారి తల్లిదండ్రులు సర్పంచ్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని ప్రతి చిన్నారి విద్యాభ్యాసానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉంటామని సర్పంచ్ పల్లె మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ఈశ్వరి, కౌసల్య పాల్గొన్నారు.

# వైభవంగా మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు



**చురకలు విలేఖరి,కరీంనగర్, మే, 30 :** ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలను కరీంనగర్లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్‌రావు పిలుపు మేరకు భారీగా కేక్ కటింగ్ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు మాజీ ప్రజాప్రతి నిధులు కాంగ్రెస్ నాయకులు పార్టీ శ్రేణులు శ్రీధర్ బాబు అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలుచోట్ల జరిగిన వేడుకల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న ముఖ్య అతిథిగా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.మాజీ కార్పొరేటర్ ఆర్ష మల్లేశం ఆధ్వర్యంలో మంచిర్యాల చౌరస్తాలో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు కేక్ కటింగ్ నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న హాజరై కేక్ కట్ చేశారు.పాత బజారులో డివిజన్ కాంగ్రెస్ నాయకుడు జిల్లోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న హాజరై కేక్ కటింగ్ చేశారు. మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన సందర్భంగా శివాలయంలో జల్లోజు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.అదేవిధంగా మారుతి నగర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుడు దుగ్గ మహేందర్ ఆధ్వర్యం లో జరిగిన మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకల్లోనూ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా కోతిరాంపూర్‌లోని పోచమ్మ దేవాలయం వద్ద కాంగ్రెస్ నాయకుడు వేముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.అదేవిధంగా పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.అలాగే 42 డివిజన్ భగత్ నగర్‌లో దుద్దిల్ల శ్రీధర్‌బాబు యువసేన జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేష్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు జరిగాయి.హౌసింగ్ బోర్డు కాలనీలోని వీరబ్రహ్మేంద్ర వృద్ధాశ్రమంలో నారోజు రాకేష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది.వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పండ్లు పంపిణీ చేశారు. వావిలాల పల్లిలో మాజీ కార్పొరేటర్ కోటగిరి భూమా గౌడ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వ హించారు.ఈ సందర్భంగా డివిజన్ ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.అదేవిధంగా వృద్ధులకు ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు.ఆయాచోట్ల జరిగిన కార్యక్ర మాలకు మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న హాజరయ్యారు. గాంధీ రోడ్ లో 30 డివిజన్ కార్పొరేటర్ కల్లపల్లి శారద బాలరాజు ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భం గా కేక్ కట్ చేశారు.కురుమ వాడలో కాంగ్రెస్ నాయకురాలు కర్రె పావని ఆధ్వర్యంలో అనాధలకు ఆహార ప్యాకెట్లు వాటర్ బాటిల్లు అందజేశారు. అదేవిధంగా కురుమవాడలో మాజీ కార్పొరేటర్ మీసా రమాదేవి ఆధ్వర్యం లో కేక్ కటింగ్ చేశారు.ఈ కార్యక్ర మానికి మార్కెట్ కమిటీ చైర్మన్ హాజరయ్యారు.11వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ ఆకుల నర్మదా ఆధ్వర్యంలో మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మీసేవ కార్యాలయంలో కార్పొరేటర్ కేక్‌కట్ చేశారు.మహిళల తో పాటు ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు.అదేవిధంగా కట్టరాంపూర్ లోని శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలోనూ కార్పొరేటర్ ఆకుల నర్మద అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు.అంబేద్కర్ స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.పలుచోట్ల కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు మాజీ ప్రజాప్రతి నిధులు కాంగ్రెస్ నాయకులు శ్రీధర్ బాబు అభిమానులు మంత్రిశ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. మంత్రి శ్రీధర్ బాబు అంకితభావంతో పనిచేస్తూ తెలంగాణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని నాయకులు కొనియాడారు.ప్రజల మనిషిగా, అభి వృద్ధి పట్ల స్పష్టమైన దృష్టితో ముందుకు సాగుతున్న నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు. కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని మంత్రి శ్రీధర్ బాబుకు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ఆయన మరింత ఆయురారోగ్యాలతో ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన పాస్టర్ కన్నూరి కృపావరం




**చురకలు ప్రతినిధి,మంథని,మే 30 :** పెద్దపల్లి జిల్లా,రామగిరి మండలం ఆదివారంపేట గ్రామానికి చెందిన కన్నూరి కృపావరం గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు. గత ఫిబ్రవరి 2న హైదరాబాద్లోని జొరాస్ట్రియన్ క్లబ్ లో గిన్నిస్ బుక్ ప్రతినిధుల ఆధ్వర్యంలో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ సమన్వయంతో జరిగిన సంగీత కార్యక్రమంలో 22 దేశాల నుంచి సుమారు 2000 మంది కీబోర్డు సంగీత వాయిద్యకారులు ఏకకాలంలో ప్రదర్శన నిర్వహించారు. అందులో ప్రతిభ కనపరచిన కొంతమందిని గిన్నిస్ వరల్డ్ రికార్డుకు ఎంపిక చేశారు.అందులో రామగిరి మండలం ఆదివారంపేట గ్రామానికి చెందిన కన్నూరి కృపావరం గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించడం ఎంపికవ్వడం విశేషం.ఎంపిక అయిన కన్నూరి కృపావరం కు ఈనెల 29 శుక్రవారం నాడు హైదరాబాదులోని గచ్చిబౌలిలో గల విక్టరీ ఆడిటోరియంలో జరిగిన "గిన్నిస్ అచీవర్స్ మీట్" కార్యక్రమంలో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు అగస్టిన్ దండంగి,గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్,మెడల్ అందజేశారు.

## తండ్రిని పోషించని కొడుకులపై ఫిర్యాదు



**చురకలు విలేకరి, జగిత్యాల, మే 30 :** జగిత్యాల మండలం శంకులపల్లి గ్రామం శివాజి వాడ కు చెందిన సంఘవేణి శంకర్(61)అనే వృద్ధుడు తన కన్న కొడుకులు ఉద్యోగాలు చేసుకుంటూ పోషించడం లేదని, ఇంట్లోంచి వెళ్లి పొమ్మని వేధింపులకు గురి చేస్తున్నారని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించారు.ఈ మేరకు ఆ వృద్ధ తండ్రి సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ సాయం తో శనివారం ఆర్డీవో పి. మధు సూదన్ కు ఫిర్యాదు చేయగా ప్రభుత్వ ఉద్యోగుల తల్లి దండ్రుల పోషణ చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం అ వృద్ధ తండ్రి సీనియర్ సిటిజెన్స్ కార్యాలయంలో విలేకరుల కు తన గోడు వినిపించారు. తన పెద్ద కొడుకు లీలాధర్ మగ్గిడి ఎస్టీ గురుకుల పాఠశాల లో ఉపాధ్యాయుడిగా, చిన్న కొడుకు సూర్యనారాయణ బ్యాంకు మేనేజర్ గా పని చేస్తూ నన్ను పోషించడం లేదని, వైద్య ఖర్చులు పెట్టక పోగా పెద్ద కొడుకు ఇంట్లోంచి వెళ్లిపొమ్మని వేధింపులకు గురి చేస్తున్నాడని తనకు నెలకు రూ. 10 వేలు చొప్పున ఇద్దరు కొడుకుల నుంచి పోషణ వైద్య ఖర్చులు ఇప్పించాలని కలెక్టర్, ఎస్పీ,ఆర్డీ ఓ,లను కోరారు. వృద్ధుని వెంట సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, ఉపాధ్యక్షులు వెల్ముల ప్రకాష్ రావు, వృద్ధుల సంరక్షణ కాన్సిలియేషన్ అధికారులు పి. సి.హన్మంత్ రెడ్డి, గౌరి శెట్టి విశ్వ నాతం, ఎం. డి. యా కూబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు



**చురకలు విలేఖరి వీణవంక మే 30 :** వీణవంక మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఐటీ శాఖ,శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు 57 వ జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అనేక అభివృద్ధి పనులు చేశారని కొనియాడారు.మరిన్ని పదవులు అధిరోహించాలని అన్నారు.మండల అధ్యక్షులు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎండీ సాహెబ్ హుస్సేన్,గంగాడి తిరుపతి రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ మాదాసి సునీల్,జిల్లా కార్యదర్శులు వావినీల సత్యనారాయణ, కంకణాల జగదీశ్వర్ రెడ్డి,సర్పంచ్ జడల శ్రీకాంత్,ఉప మ్యాక శ్రీనివాస్,మాజీ సర్పంచ్ చిన్నాల ఐలయ్య, ధర్మకర్త జున్నుతుల మధుకర్ రెడ్డి,ఏలే మధుసూదన్,గుంటి రవీందర్,ఓడ్డేపల్లి కొమురయ్య, వివిధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు వోరేం శ్రీనివాస్,ఎల్కపల్లి లక్ష్మణ్,మడ్డి అనిల్, గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు మోటం శ్రీనివాస్,సిలివేరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎస్సైల బదిలీలు

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మే 30 :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లకు చెందిన సబ్ ఇన్స్పెక్టర్లను బదిలీ చేస్తూ శనివారం జిల్లా ఎస్పీ మహేష్ బీ గీతే ఉత్తర్వులు జారీ చేశారు.డి ఎస్ బి.ఆర్‌గా పనిచేస్తున్న ఎం నాగరాజును సిరిసిల్ల టౌన్ పిఎస్‌కు ముస్తాబాద్ పిఎస్‌లో పనిచేస్తున్న ఎస్సై సిహెచ్ గణేష్‌ను సిరిసిల్ల టౌన్ పిఎస్ కు సిరిసిల్ల టౌన్ పిఎస్‌లో పనిచేస్తున్న ఎస్సై సిహెచ్ శ్రీ కాంత్ ను గంభీరావుపేట పిఎస్‌కు డిసి ఆర్బిసిసిగా పనిచేస్తున్న ఎస్సై జి జ్యోతిని ముస్తాబాద్ పిఎస్‌కు గంభీరావుపేటలో ఎస్సైగా పనిచేస్తున్న పి అనిల్ కుమార్‌ను సిరిసిల్ల సిసిఎస్ ఎస్‌ఐగా సిరిసిల్ల సిసిఎస్గా పనిచేస్తున్న పాక గణేష్‌ను వేములవాడ టౌన్ పిఎస్‌గా విఆర్ సిరిసిల్ల టౌన్ పిఎస్‌లో పనిచేస్తున్న ఎ మురళీధర్ గౌడ్‌ను ఎల్లారెడ్డిపేట ఎస్సై 2గా బదిలీ చేస్తూ ఎస్పి ఉత్తర్వులు జారీ చేశారు.

# ప్రజల ప్రశంసలు అందుకుంటున్న హుజరాబాద్ సిఐ కరుణాకర్



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ మే 30 :** హుజురాబాద్ సిఐ కరుణాకర్ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తూనే సామాజిక సేవ కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. సరిగ్గా ఏడాది క్రితం 2025 మే లో ఆయన విధుల్లో చేరారు. అప్పటినుండి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ నియమ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. కళాశాలలో ర్యాగింగ్ నిరోధానికి ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు పోలీసు కమిషనర్ గౌస్ ఆలం కూడా హాజరయ్యారు. స్థానిక ఏసిపి వాసంశెట్టి మాధవి సహకారంతో పలు కేసులను చేదించారు. అలాగే వందలాదిమంది నిరక్షరాస్యులు అయిన, నిరుపేదలైన వాహనదారులకు, ఆటో డ్రైవర్లకు స్థానిక మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ తో చర్చించి లైసెన్సులు అందజేశారు. కళాశాలలో విద్యాసంస్థల్లో సైబర్ క్రైములపై కూడా అవగాహన సదస్సులను నిర్వహించారు. కుటుంబ వివాదాలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ తీవ్రరూపం దాల్చకుండా కృషి చేస్తున్నారు. కార్డెన్ సెర్చ్‌లు కూడా పలుచోట్ల నిర్వహించారు. డ్రగ్స్ పై కూడా యువతకు అవగాహన కల్పిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టారు. గతంలో తను చేసిన సేవలకుగాను పోలీసు మెడల్స్ సిఐ కరుణాకర్ అందుకోవడం గమనార్హం.

**ప్రజల సహకారం వల్లే..**

హుజురాబాద్ పోలీసు సర్కిల్ పరిధిలో ప్రజల సహకారంతోనే శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమైందని సిఐ కరుణాకర్ తెలిపారు. కుటుంబ వివాదాలను వెనువెంటనే సమయం కేటాయించి పరిష్కరిస్తున్నామని లేకుంటే అవి శాంతిభద్రతల సమస్యగా మారే అవకాశం ఉందన్నారు. అన్నదమ్ముల మధ్యలో పంచాయతీలు, భార్యాభర్తల మధ్య వివాదాలు కౌన్సిలింగ్ తో పరిష్కరిస్తున్నామని దీనికి మంచి స్పందన కూడా లభిస్తోందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సివిల్ తగాదాల్లో తలదూర్చవద్దని స్థానిక పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించామని తెలిపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేస్తున్నామని, తాము ప్రతిపాదనలు పంపితే అదనంగా పోస్టులు మంజూరయ్యాయని, సిబ్బందిని కేటాయించారని తెలిపారు. రాత్రిపూట గస్తీ ఎక్కువ చేశామని, రోడ్డు ప్రమాదా లాంటి నివారణకు కూడా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏడాది కాలంలో ప్రజల సహకారం వల్లే తమ పని చేయగలిగామని వివరించారు. భవిష్యత్తులను ఇదే సహకారాన్ని కొనసాగించాలని ఆయన కోరారు.

# శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే ధ్యేయం

### -వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ సీవీ ఆనంద్ దిశానిర్దేశం



**చురకలు ప్రతినిధి కరీంనగర్ మే 30 :** కరీంనగర్: రాష్ట్రంలో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేయడానికి, ప్రజలకు సమర్ధవంతమైన సేవలు అందించడానికి పోలీస్ శాఖ సరికొత్త కార్యాచరణతో ముందుకు సాగుతోంది. శనివారం రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ అన్ని కమీషనరేట్లు, విభాగాలు, జిల్లాల ఎస్పై మరియు అంతకంటే పైస్థాయి అధికారులతో దాదాపు రెండు గంటల పాటు సుదీర్ఘ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కరీంనగర్ నుండి సీపీ గౌష్ ఆలం కమీషనరేట్ అధికారులతో కలిసి ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, సాంప్రదాయ నేరాల కంటే ప్రస్తుతం సైబర్ నేరాలు దేశవ్యాప్తంగా పెను సవాలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో దొంగతనాలు, దోపిడీల ద్వారా రూ. 500 కోట్లు నష్టం వాటిల్లితే, ఒక్క సైబర్ నేరాల ద్వారానే ఏకంగా రూ. 15 వేల కోట్లు కొల్లగొట్టబడ్డాయని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అలాగే మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతీ విద్యాసంస్థలో తప్పనిసరిగా 'యాంటీ డ్రగ్ సేఫ్టీ కమిటీలు' ఏర్పాటు చేయాలని, డ్రగ్స్ దుర్వినియోగంపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు 'ట్రాఫిక్ మేనేజ్మెంట్ మరియు రోడ్ సేఫ్టీ బ్యూరో'తో పాటు, ఆహార కల్తీ, డ్రగ్ కంట్రోల్ కోసం 'విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్' రాష్ట్రస్థాయి కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు డీజీపీ ప్రకటించారు. మహిళలు, పిల్లల రక్షణ, మానవ అక్రమ రవాణాపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ డీజీపీ కార్యాలయంలో టెక్ టీం ఆఫీస్ ఏర్పాటు చేస్తున్నామని, సీసీటీఎన్ఎస్ లో కేసుల డేటాను పూర్తిగా అప్లోడ్ చేయాలని ఆదేశించారు.. దీనిపై టెక్నికల్ సర్వీసెస్ డీజీపీ వీ. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో డేటా నమోదు అత్యంత కీలకమని, ఇతర ప్రాంతాల నుండి వచ్చే 'జీరో ఎఫ్ ఐ ఆర్'లను వెంటనే నమోదు చేయాలన్నారు. అడిషనల్ డీజీపీ (శాంతిభద్రతలు) మహేష్ భగవత్ మాట్లాడుతూ నేరగాళ్లను పట్టుకునేందుకు ఫింగర్ ప్రింట్ స్కానర్లను విరివిగా ఉపయోగించాలని సూచించారు. సీఐడీ డీజీపీ చారు సిన్హా మాట్లాడుతూ నెలవారీ నేర సమీక్షల డేటాను క్రోడీకరించి డీజీపీకి సమర్పిస్తామన్నారు. ఐజీపీ (పర్సనల్) మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలో తీసుకురాబోయే నూతన హెల్త్ స్కీమ్ కొరకు సిబ్బంది వివరాలను త్వరితగతిన నమోదు చేయాలని కోరారు. పోలీసింగ్ విధానంలో మార్పులు రావాలని, బాధితుల పట్ల ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అవలంబిస్తూనే, నేరస్థులు, సంఘవిద్రోహ శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడి, క్రమశిక్షణతో, అంతర్గత సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. యూనిట్ అధికారులు నాయకుడిగా ముందుండి సిబ్బందిని నడిపించాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కొరకు ప్రతి పనిదినాల్లో మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల వరకు కమీషనరేట్ కార్యాలయాల్లో అందుబాటులో ఉండి బాధితులు, కిందిస్థాయి సిబ్బంది నుండి ఫిర్యాదులు స్వీకరించాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయడం ద్వారా నేరాలను తగ్గించవచ్చన్నారు. 'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సముదాయాల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. భూవివాదాల విషయంలో ఇరువర్గాల వాదనలు విని, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారంచట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీజీపీ అధికారులను ఆదేశించారు.

# ఎస్ఐఆర్ పట్ల ఎంఐఎం నేతలు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి

**-390 బూత్‌లలో ఎంఐఎం పార్టీ ద్వారా బిఎల్వో-2ల నియామకం పూర్తవుతుంది**

**-ఎంఐఎంను బూత్ స్థాయిలో బలోపేతం చేయడానికి ఇదే మంచి అవకాశం**

**-ఈద్ మిలాప్ కార్యక్రమంలో ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్**




**చురకలు ప్రతినిధి,కరీంనగర్, మే 30 :** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్ఐఆర్ ఓటర్ మ్యాపింగ్ పై ఎంఐఎం నాయకులు కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఎంఐఎం అధ్యక్షుడు హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు శనివారం ఎంఐఎం కరీంనగర్ కార్యాలయం దారు స్థలంలో ఈద్-ఉల్ అజ్హా బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఈద్ మిలాద్ కార్యక్రమాన్ని పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ... గత ఏడు సంవత్సరాలుగా కరీంనగర్ దారుస్సలాంలో ఎంఐఎం అధ్యక్షుడు బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఈ సమగ్ర ఓటర్ సవరణ పేరుతో కొత్తగా ఓటర్లుగా చేర్చడం, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారిని ఏదైనా కారణం తోటి ఎవరినైనా ఓటర్ జాబితా నుంచి ఎన్నికల సంఘం తొలగించే అవకాశం ఉందన్నారు. పట్టణంలో ఏఒక్క బూతులో అర్హుడైనఓటర్‌ను తొలగించకుండా జాగ్రత్తతో దృష్టి పెట్టాలన్నారు. కరీంనగర్ లాంటి నగర ప్రాంతాల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. ఎందుకంటే వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని, అలాగే బిజెపి వాళ్లు కొన్ని వర్గాల వారిని టార్గెట్ చేసుకొని వారిని తొలగించే కార్యక్రమం ముఖ్యంగా కరీంనగర్ హైదరాబాద్ లాంటి నగరాల్లో ఎక్కువ జరుగుతదన్నారు. త్వరలో హైకమాండ్ ఆదేశాల మేరకు బిఎల్ఏ 2 ఏజెంట్లను నియామకం పూర్తవుతుందన్నారు. ఈ సమగ్ర ఓటర్ సవరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని తమ ఓట్లు ఉన్నాయా లేదా గ్రామంలో అందరి ఓట్లు ఉన్నాయా లేకపోతే కొత్తగా చేర్పించడం లాంటి విషయంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఈ ఓటర్ సవరణ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. వెస్ట్ బెంగాల్ లాంటి కొన్ని సరిహద్దు రాష్ట్రాల్లో ఓటర్ సవరణ కార్యక్రమం చేపట్టడం ద్వారా బిజెపి అక్కడ విజయం సాధించిందని చెప్పారు. ఎంఐఎం పార్టీకి కార్యకర్తలే స్టార్ క్యాంపెనియర్లని చెప్పారు. ఎస్ఐఆర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కేంద్ర ఎన్నికల కమిషన్ ను ముందు పెట్టి ఇతర పార్టీల అనుకూల ఓటర్లను తొలగించే ప్రక్రియ చేపడుతుందని దానిపై ప్రతి పౌరునికి అవగాహన అవసరమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ఇప్పటికే కార్పొరేషన్ పరిధిలో బిఎల్ ఏ 2 ల నియామకం త్వరలోనే పూర్తవుతుందని, వర్క్ షాపు శిక్షణ తరగతులు నిర్వహించి ఎంఐఎం కార్యకర్తలకు ఇప్పటికే అవగాహన కల్పించామని, హైకమాండ్ ఆదేశాల మేరకు నగరంలో ఎన్నికల అధికారులు చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీకి నష్టం కలిగించే అంశాలను కూడా నిర్లక్ష్యం చేయకుండా పార్టీ హైకమాండ్ ఇస్తున్న సూచనలను ఆదేశాలను పాటిస్థామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం జాయింట్ సెక్రటరీ హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి,కోశాధికారి ఇబ్రహీం బియబాని,కార్పొరేటర్ మాజిద్ హుస్సేన్,మాజీ కార్పొరేటర్లు బాబు జానీ,అరిఫ్ అహ్మద్,లింగపల్లి శ్రీనివాస్, కంటెస్టెడ్ కార్పొరేటర్లు వాజిద్అలీఖాన్, అన్నేమల్ల సురేశ్, అక్బర్ అలీ, డివిజన్ అధ్యక్షులు తాజుద్దీన్, సాజిద్, ఆవేజ్, అబ్దుల్ సలీం, అసదుల్లా బేగ్, మీర్జా పాషా, వసీంతో పాటు 300మంది పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా రాచర్ల తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి తిరు కళ్యాణం

**-స్వామివారిని దర్శించుకున్న ప్రజాప్రతినిధులు నాయకులు**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మే 30 :** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో గుట్టపై రాచర్ల తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువుదీరి దివ్య మంగళ స్వరూపిడిగా దర్శనమిస్తున్న రాచర్ల లక్ష్మీ శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ప్రతిష్ట గావించి 41 రోజులు పూర్తి అయిన సందర్భంగా స్వామివారికి మండల అభిషేకం శనివారం ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం 8 :00గంటలకు విశ్వక్సేన ఆరాధన వాసుదేవ పుణ్యాహవాచనం చోడచోపచర కలిసస్థాపన విశేష అభిషేకం నివేదన మంగళ శాసనం చేశారు, పాల్గొన్న భక్తకోటికి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న భక్తకోటికి మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు సాయంత్రం 5:00గంటలకు స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది ఈ కార్యక్రమాలను పురోహితులు శ్రీమాన్ కొండపాక నరసింహాచార్యులు నరసింహ ఉపవాసకులు కొండపాక గోపికృష్ణ ఆచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు తిరు కళ్యాణ మహోత్సవానికి ఎల్లారెడ్డిపేట గొల్లపల్లి రాజన్నపేట అల్మాస్ పూర్ తిమ్మాపూర్ నారాయణపూర్ వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా స్వామివారిని కాంగ్రెస్ బిజెపి బిఆర్ఎస్ టిఆర్ఎస్ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు ఆలయ కమిటీ పాలకవర్గం సభ్యులు వివిధ గ్రామాల మహిళా భక్తులు తరలి వచ్చి స్వామి వారి కృపకు పాత్రులయ్యారు.



